సాక్షి
కామారెడ్డి
శనివారం । 24 । ఆగస్టు । 2024



వెక్కిరిస్తున్న ఖాళీలు..
భిక్కనూరు పీహెచ్‌సీలో సిబ్బంది కొరత వేధిస్తోంది. అక్కడి ఉద్యోగులు పనిభారంతో ఇబ్బంది పడుతున్నారు.
- 8లో ▸



ఘనంగా అంతరిక్ష దినోత్సవం
జిల్లాలోని పలు పాఠశాలల్లో శుక్రవారం అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు కార్యక్రమాలు చేపట్టారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
31.4 /22.6

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



కామారెడ్డి క్రైం: జిల్లా వ్యవసాయ అధికారిగా తిరుమల ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఆయన నిజామాబాద్ వ్యవసాయశాఖలో ఆత్మ విభాగం పీడీగా పని చేశారు. ఇక్కడ డీఏవోగా పని చేసిన భాగ్యలక్ష్మి కరీంనగర్‌కు బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. తిరుమల ప్రసాద్ బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు జిల్లా స్థాయి యోగాసన పోటీలు


కామారెడ్డి అర్బన్: జిల్లా యోగా, స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగాసన పోటీలు జిల్లా కేంద్రంలోని యోగాభవన్‌లో శనివారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. బాలబాలికలు, మహిళలు, పురుషులు పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 9299996088, 9440037948, 9666470472 నంబర్లకు సంప్రదించాలన్నారు.

పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి



భిక్కనూరు: విద్యార్థి దశ నుంచే పరిశోధనలపై ఆసక్తి పెంపొందించుకోవాలని జిల్లా సైన్స్ అధికారి సిద్ధరాంరెడ్డి అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా శుక్రవారం భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడు తమ్మళి రాజు నిర్వహించిన టాలెంట్ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి చూపితే శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉందన్నారు. హెచ్ఎంలు శ్రీనాథ్, సుజాత పాల్గొన్నారు.

రైతులకు దక్కని సహకారం



రుణమాఫీ కోసం ఎన్నో ఆశలతో ఎదురు చూసిన అన్నదాతలకు నిరాశే మిగిలింది. ప్రభుత్వ నిర్ణయంతో తమ కష్టాలు తీరుతాయని భావించిన వారి ఆశలు అడియాసలు అయ్యాయి. మాఫీకి అర్హత ఉన్నా జాబితాలో తమ పేరు ఎందుకు లేదో తెలియక పలువురు రైతులు అయోమయానికి గురవుతున్నారు. ముఖ్యంగా జిల్లాలోని సహకార బ్యాంకుల్లో లోన్లు తీసుకున్న చాలా మందికి రుణమాఫీ నిధులు జమ కాలేదు. దీంతో నిత్యం బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

- రుణమాఫీలో డీసీసీబీలో లోన్లు ఉన్న చాలా మందికి నిరాశే..
- 1.12 లక్షల మందిలో 40,654 మందికి మాత్రమే మాఫీ
- అధికారుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నుంచి రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ విషయంలో సహకారం దక్కలేదు. ప్రభుత్వం పెట్టిన కొర్రీలతో అర్హత ఉన్నా సగానికి పైగా రైతులకు రుణాలు మాఫీ కాకపోవడమే ఇందుకు నిదర్శనం. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా ఉమ్మడి జిల్లాలో 1.12 లక్షల మంది రుణమాఫీకి అర్హులుగా గుర్తించారు. వారికి సంబంధించి రూ.520 కోట్ల మేర రుణాలు మాఫీ కావాల్సి ఉంది. అయితే 40,654 మందికి సంబంధించి రూ.169.73 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. ఇంకా 71 వేల మంది రైతులకు మాఫీ కావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. కారణాలు ఏమైనా రుణమాఫీ జరగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మాకెందుకు మాఫీకావడంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నుంచి రైతులకు ఆయా సీజన్లలో వివిధ రకాల రుణాలు ఇవ్వడం, వాటిని వసూలు చేయడం చేస్తున్నారు. పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేయడానికి నిర్ణయం తీసుకోవడంతో క్రాప్ లోన్స్ తీసుకున్న రైతులంతా ఎన్నో ఆశలు పెంచుకున్నారు. బ్యాంకు రుణం తీరినట్టేనని భావించారు. తీరా జాబితాల్లో తమ పేర్లు లేకపోవడతో ఖంగుతిన్నారు. బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

ప్రజాప్రతినిధుల చొరవ అవసరం

జిల్లాలో సహకార బ్యాంకు నుంచి రుణం తీసుకున్న రైతులకు మాఫీలో జరిగిన అన్యాయంపై ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది. ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులు తమ రుణాలు మాఫీ కాకపోవడంతో మనోవేదన చెందుతున్నారు. చాలా మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. రుణమాఫీలో ఏర్పడిన ఇబ్బందులను తొలగించి, అర్హులైన అందరికీ మాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొన్ని సంఘాల పరిధిలో మాఫీ వివరాలు

- మాచారెడ్డి సహకార సంఘం ద్వారా డీసీసీబీ నుంచి 2,205 మంది రైతులు రుణాలు పొందగా వారిలో 509 మందికి మాత్రమే రుణాలు మాఫీ అయ్యాయి.
- ఎల్లారెడ్డి మండలంలోని ఎల్లారెడ్డి, మత్తమాల, వెల్లుట్ల సొసైటీల పరిధిలో 3,289 మంది రైతులకు గాను 1,629 మంది రుణాలు మాఫీ అయ్యాయి.
- లింగంపేట మండలంలో లింగంపేట, షెటపల్లి సంగారెడ్డి, నల్లమడుగు సొసైటీల పరిధిలో 3,399 మందికి గాను 1,375 మందికి మాఫీ అయ్యాయి.
- బిచ్కుంద మండలంలో బిచ్కుంద, పుల్కల్ సొసైటీలలో కలిపి 2,532 మంది రుణాలు తీసుకోగా 685 మందికి మాత్రమే మాఫీ అయింది.
- మద్నూర్ మండలంలోని మద్నూర్, డోంగ్లీ సొసైటీల పరిధిలో 2,269 మంది రైతులకు 671 మందికే రుణాలు మాఫీ అయ్యాయి.
- పెద్దకొడప్‌గల్ సొసైటీ పరిధిలో 1,218 మంది రైతులకు 423 మందికే రుణమాఫీ వర్తించింది.
- పిట్లం మండలంలో నాలుగు సొసైటీల పరిధిలో 5,527 మంది రైతులు లోన్లు తీసుకోగా 2,409 మందికే మాఫీ అయింది.
- సదాశివనగర్ మండలంలో నాలుగు సింగిల్ విండోల పరిధిలో 4,691 మంది రైతులకు 1,546 మంది రైతులు రుణాలు మాఫీ అయ్యాయి.
- బీబీపేట విండో పరిధిలో 1,503 మంది రైతులకు 663 మంది రుణాలు మాఫీ అయ్యాయి.
- తాడ్వాయి మండలంలో రెండు సొసైటీల పరిధిలో 2,258 మంది రైతులకు 1,040 మంది రుణాలు మాఫీ అయ్యాయి.

కొర్రీలు కొంపముంచాయి

రుణమాఫీకి రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడం రైతులకు శాపంగా మారింది. ఏళ్లుగా కొత్త రేషన్‌కార్డులు జారీ కాకపోడంతో చాలా కుటుంబాల్లో తల్లిదండ్రులు, అన్నదమ్ముల పేర్లు అన్నీ ఒకే రేషన్ కార్డుపై కొనసాగుతున్నాయి. కుటుంబాలు విడిపోయి ఎవరికి వారు జీవనం సాగిస్తూ, ఎవరి పేరున వారు భూమి రిజిస్ట్రేషన చేసుకుని సాగు చేసుకోవడం, వాటిపై రుణాలు తీసుకోవడం జరిగింది. అయితే రేషన్ కార్డు ఆధారంగా కుటుంబానికి రూ.రెండు లక్షలలోపు మాత్రమే మాఫీ నిబంధన పెట్టడంతో చాలా మంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. అలాగే అప్పట్లో కరువుతో చాలా మంది గల్ఫ్ దేశలకు వలస వెళ్లడంతో వారి పేర్లు కూడా రేషన్ కార్డుల్లో లేకుండాపోయాయి. దీంతో వాళ్లకూ రుణమాఫీ జాబితాలో అవకాశం దక్కలేదు.

“నయాపైసా మాఫీ కాలేదు



నేను బిచ్కుంద సొసైటీ నుంచి 2022 లో రూ.35 వేలు లోన్ తీసుకున్నా. మూడు విడతల రుణమాఫీలో నాది నయాపైసా మాఫీ కాలేదు. అధికారులను అడిగితే నీకు అర్హత ఉందని చెబుతూ, సాంకేతిక కారణాలతో కాలేదేమోనంటున్నారు. నాకెందుకు అన్యాయం జేస్తుండ్రో అర్థం అయితలేదు. ప్రభుత్వం న్యాయం చేయాలి

– శేషాబాయి, మిషన్ కల్లాలి, బిచ్కుంద

సరైన సమాధానం ఇవ్వడం లేదు



నాపేరిట, నాభార్య, కొడుకు పేరిట లోన్ ఉంది. ముగ్గురికి కలిపి రూ.2 లక్షలకుపైగా ఉంది. అయితే రేషన్ కార్డు నిబంధనతో మాఫీ కాలేదన్నారు. ముగ్గురిలో ఒక్కరికి కూడా మాఫీ చేయకపోవడం విచారకరం. ముగ్గురమూ అర్హులమే. అధికారుల వద్దకు వెళితే సరైన సమాధానం ఇవ్వడం లేదు. మాకు న్యాయం చేయాలి.

– చిన్న రామాగౌడ్, కోనాపూర్, బీబీపేట

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి



కామారెడ్డి టౌన్: కార్యకర్తలు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ సీనియర్ నేత అల్జాపూర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 2న ప్రధాని నరేంద్ర మోదీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తారని, 3న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభం చేశాక, 5 నుంచి జిల్లాలో సభ్యత్వ నమోదు ప్రారంభించాలని తెలిపారు. పార్టీ సభ్యత్వంలో విషయంలో చైనా కమ్యునిస్టు పార్టీని, బీజేపీ అధిగమించిన విషయాన్ని గుర్తు చేశారు. 8800002024 సభ్యత్వ నమోదు నంబర్ అని, ఈ నంబర్‌కి మిస్ కాల్ ఇవ్వడం ద్వారా సభ్యత్వ నమోదు చేసుకోవచ్చని, లేదా నమో యాప్ లేదా దరఖాస్తు ఫారం ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని వివరించారు. జిల్లా అధ్యక్షురాలు అరుణతార, మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, బీజేపీ సీనియర్ నేత మురళీధర్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి, నరేందర్ రెడ్డి, రవీందర్ రావు, లక్ష్మారెడ్డి, లింగారావు, శ్రీనివాస్, శ్రీధర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మోటురి శ్రీకాంత్, కౌన్సిలర్‌లు శ్రీనివాస్, నరేందర్, నాయకులు నీలం చిన్న రాజులు, రంజిత్ మోహన్, పైలా కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘సీపీఎస్’ను రద్దు చేయాలి



కామారెడ్డి టౌన్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుంట ఎల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులకు అన్యాయం చేస్తున్న జీవో 28ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌తో ఉద్యోగులు రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. నాయకులు లింగం, విజయవర్ధన్, మోహన్, శ్రీనివాస్, దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాపై డెంగీ పంజా

- జీజీహెచ్‌లో గత నెలలో 15, ఈ నెలలో 52 కేసులు నమోదు
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటున్న వందలాది మంది
- మరణాలు సంభవిస్తున్నా పట్టించుకోని అధికారులు



కామారెడ్డిలోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

కామారెడ్డి టౌన్: జిల్లాపై డెంగీ పంజా విసురుతోంది. దోమల వ్యాప్తి పెరిగి జనం విషజ్వరాల బారిన పడుతున్నారు. మరణాలు సంభవిస్తున్నా జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ నెల 21న లింగంపేట్ మండలంలో డెంగీతో 22 ఏళ్ల యువకుడు, ఇదే మండల కేంద్రంలో 20న తీవ్ర జ్వరంతో బీటెక్ విద్యార్థి మృత్యువాత పడ్డారు. 13న మాచారెడ్డి మండలం లక్ష్మీరావుపల్లెలో ఎనిమిది డెంగీ కేసులు నమోదు కాగా, నిజాంసాగర్ మండలంలోని ఒడ్డేపల్లి, మహమ్మద్‌నగర్ గ్రామాల్లో చాలా మంది డెంగీ లక్షణాలు, విషజ్వరాలతో మంచానపడ్డారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జులైలో 15, ఆగస్టులో 52 డెంగీ పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి. జీజీహెచ్‌లో మంచాలన్నీ రోగులతో నిండిపోయాయి. జిల్లాలోని ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వందల సంఖ్యలో డెంగీ కేసులు నమోదు అవుతున్నాయని తెలుస్తోంది.

డెంగీ కేసు నమోదైతే..

డెంగీ కేసులు నమోదైతే ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక నివారణ చర్యలు చేపడుతారు. బాధితుడి ఇంటి పరిసరాల్లోని 50 మీటర్ల వరకు పైరెథ్రమ్ అనే మందును పిచికారీ చేయిస్తారు. ఇలా చేయడం ద్వారా దోమలు, వాటి గుడ్లు కూడా నశిస్తాయి. కానీ జిల్లాలో అధికారులు నామమాత్రంగా చర్యలు చేపడుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డెంగీ రాకుండా ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. వారంలో ఒక రోజును డ్రైడేగా పాటించి నీటి ట్యాంకులను శుభ్రం చేసుకోవాలి. దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలి. పారిశుధ్యం లోపించకుండా చూసుకోవాలి.

దోమకాటుతోనే..

దోమ కాటుతోనే రోగాలు, సీజనల్ వ్యాధులు వస్తున్నాయని డాక్టర్లు చెబుతున్నారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే డెంగీ దోమలు వృద్ధి చెందుతాయని, అపరిశుభ్ర వాతావరణంతోనే రోగాలు వస్తున్నాయని అంటున్నారు. ఇదిలా ఉంటే జిల్లాలో జనవరి నుంచి ఇప్పటి వరకు 6 వేలకు పైగా జ్వరాల కేసులు నమోదయ్యాయి. కొందరు జ్వర బాధితులు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు డెంగీ చికిత్సకు ఒక్కో రోగి నుంచి రూ.40 వేల నుంచి రూ.లక్షకు పైగా, చిన్నపిల్లలకైతే రూ.20 నుంచి రూ. 30వేలకు పైగా వసూలు చేస్తున్నాయి. ప్లేట్‌లెట్లు తగ్గాయని భయపెడుతూ దోచుకుంటున్నారు.

ఒడ్డేపల్లిలో తొమ్మిది మందికి..

నిజాంసాగర్: మండలంలోని ఒడ్డేపల్లి గ్రామ పంచాయతీలో డెంగీ బాధితులు రోజురోజుకు పెరుగుతున్నారు. వారం రోజుల నుంచి గ్రామ పంచాయతీ పరిధిలో 8 మంది డెంగీ బారినపడ్డారు. శుక్రవారం తాజాగా మరొకరికి డెంగీ నిర్ధారణ కావడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. రోగుల నిర్ధారణ కోసం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ వివరాలు సేకరిస్తున్నారు. గ్రామంలో డ్రెయినేజీలు, పరిసరాలు శుభ్రం చేయించారు. అయినా డెంగీ కేసులు నమోదు అవుతుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

లోపిస్తున్న పారిశుధ్యం

పట్టణాలు, గ్రామాల్లో మురుగు కాల్వలను శుభ్రం చేయకపోవడంతో దోమలు పెరుగుతున్నాయి. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి నీటి గుంతలతో పాటు మురుగు కాల్వలు, పగిలిన కుండలు, తొట్లు, డ్రమ్ముల్లో నీటిని తొలగించాల్సి ఉన్నా ఇది పక్కాగా అమలు కావడం లేదు. అధికారులు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు తప్పితే విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. క్రమ తప్పకుండా ఫాగింగ్ చేయడం లేదు. చాలా పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలే లేవు. మున్సిపాలిటీల్లో అసలు బల్దియా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

“అప్రమత్తంగా ఉండాలి



జిల్లాలో విషజ్వరాలు ప్రబలుతున్న ప్రాంతాల్లో సర్వే చేయిస్తున్నాం. వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకోవాలి.

– చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో, కామారెడ్డి

రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు, న్యాయవాదులు

- భూముల డిజిటల్ సర్వే చేపట్టాలి
- ముసాయిదా రెవెన్యూ చట్టంపై పలువురి అభిప్రాయం

కామారెడ్డి క్రైం: గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలని, ప్రభుత్వానికి, ప్రజలకు గ్రామ స్థాయి రెవెన్యూ అధికారులు వారధిగా ఉంటారని జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు, తహసీల్దార్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. ముసాయిదా రెవెన్యూ చట్టం–2024పై చర్చా వేదిక కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. న్యాయవాదులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు, రైతులు మాట్లాడారు. డ్రోన్ సాయంతో వ్యవసాయ భూముల డిజిటల్ సర్వే చేపట్టాలని కోరారు. ఆర్డీవోలకు అప్పిలేట్ అథారిటీ అధికారం ఇవ్వాలని కోరారు. పౌల్ట్రీ ఫారం, చేపలు, ఎర్రచందనం మొక్కల పెంపకం లాంటి వాటిని వ్యవసాయానికి సంబంధించినవిగా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. అధికారుల, రైతుల సలహాలు, సూచనలు ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు రంగనాథ్ రావు, ప్రభాకర్, ఏవో మసూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద సూచికలు ఏర్పాటు చేయండి

భారీ వర్షాలు వచ్చినప్పుడు వరద నీరు కల్వర్టులపై నుంచి ప్రమాదకరంగా ప్రవహించే అవకాశం ఉన్న జిల్లాలోని 27 రోడ్ల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆర్ అండ్‌బీ, పంచాయతీ అధికారులతో శుక్రవారం సమీక్ష ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. భారీ వర్షాలు వస్తే ప్రజలు కల్వర్టుల మీదుగా ప్రయాణం చేయకుండా చూడాలన్నారు. అలాగే వరద సమయాల్లో కల్వర్టుల వద్ద భారీ గేట్లను ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ రవిశంకర్, డీపీవో శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

‘ఎల్ఆర్ఎస్’ను పారదర్శకంగా చేపట్టాలి



బాన్సువాడ రూరల్: ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శుక్రవారం ఆయన బాన్సువాడ పట్టణంలో ఎల్ఆర్ఎస్ అమలు తీరును పరిశీలించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ముందస్తుగా సమాచారం అందించి క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్లాలని అధికారులుకు సూచించారు. సర్వేనెంబర్, ప్లాట్‌నెంబర్, రోడ్డు విస్తరణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, తహసీల్దార్ వరప్రసాద్, నీటిపారుదలశాఖ ఏఈ గజానంద్, ఎంపీడీవో బషీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

‘పైసలిస్తేనే పనులు చేస్తుండ్రు’

- తహసీల్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన



నిరసన తెలుపుతున్న రైతులు

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట తహసీల్ కార్యాలయంలో ఏ పని చేయాలన్నా దళారుల ద్వారా పైసలు ఇవ్వాల్సిందేనని, పైసలు ఇయ్యకపోతే పనులు సరిగ్గా చేయడం లేదని రైతులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. నాగిరెడ్డిపేట గ్రామానికి చెందిన కుమ్మరి అంజయ్య మాట్లాడుతూ.. పాపన్నపేట మండలం నుంచి ఇల్లరికం తెచ్చుకున్న తన అల్లుడికి కార్యాలయంలో గతంలో రెసిడెన్షియల్ సర్టిఫికెట్ ఇచ్చారని చెప్పారు. ఆయనకే ఆదాయం, కులం సర్టిఫికెట్లు ఇవ్వాలని దరఖాస్తు చేసుకుంటే ఇక్కడ ఇవ్వడం కుదరదని, పాపన్నపేట మండలంలోనే తీసుకోవాలని చెబుతున్నారని ఆయన ఆవేదనవ్యక్తం చేశారు. పట్టా మార్పిడి కోసం తహసీల్ ఆఫీసులో ఇవ్వాలని చెప్పి మీ సేవా నిర్వాహకుడు తన వద్ద రూ.12 వేలు అదనంగా తీసుకున్నాడని ఆరోపించారు. తన భార్య పేరిట ఉన్న భూమిని తన పేరు మీదకు మార్చుకోవడానికి దరఖాస్తు చేసుకుంటే మూడు నెలలుగా తిప్పుకుంటున్నారని ధర్మారెడ్డి గ్రామానికి చెందిన గులపల్లి బాలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయంలో పని చేసే ఓ వ్యక్తి ద్వారా కొంతమంది అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపించారు. దీనిపై తహసీల్దార్ లక్ష్మణ్‌ను వివరణ కోరగా తాము ఎలాంటి అవినీతికి పాల్పడలేదన్నారు. నిబంధనల ప్రకారమే పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. తన పేరిట డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్ వస్తున్నారని గుంతలు పూడ్చేశారు..



బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలో శుక్రవారం కలెక్టర్ పర్యటన ఉందని సమాచారం తెలుసుకున్న ఆర్అండ్బీ అధికారుల్లో ఒక్కసారిగా చలనం వచ్చింది. బిచ్కుంద బాన్సువాడ రోడ్డులో ఎస్బీఐ బ్యాంక్ ఎదుట, పెట్రోల్ బంక్ ఎదుట, అక్కడక్కడ రోడ్డుపై మోకాళ్ల వరకు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. కలెక్టర్ వస్తున్న సందర్భంగా అధికారులు గుంతలలో స్టోన్ పౌడర్ వేసి రోడ్డును చదును చేశారు. కలెక్టర్ పుణ్యమా అంటు గుంతలు పూడ్చడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని నెలల నుంచి గుంతలు ప్రమాదకరంగా మారి వాహదారులు అదుపు తప్పి ప్రతి రోజు రెండు, మూడు ప్రమాదాలు జరుగుతున్నాయి. గత మూడు నెలల నుంచి ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఆర్అండ్బీ అధికారులను వేడుకున్న ఎలాంటి మరమ్మతులు చేయలేదు. కలెక్టర్ రాకతో రోడ్డు మరమ్మతులు జరిగాయని ప్రజలు అంటున్నారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ




ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని సబ్దల్పూర్లో అంగన్వాడీ కేంద్రాన్ని ఆర్డీవో మన్నె ప్రభాకర్ శుక్రవారం తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీటి నిలువ లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ప్రకాష్ తదితరులున్నారు.

మినీ ట్యాంక్బండ్ పార్క్ మ్యాప్ పరిశీలన



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పెద్ద చెరువు కట్టపై జరుగుతున్న మినీ ట్యాంక్ బండ్ పనులతో పాటు చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పాటు చేయనున్న పార్క్కు సంబంధించిన మ్యాప్ను ఎమ్మెల్యే మదన్మోహన్రావు శుక్రవారం పరిశీలించారు. పార్క్ పనులుల వేగంగా పూర్తి చేయాలన్నారు.

ప్లాస్టిక్ బిందెలకు భలే డిమాండ్..



ఎల్లారెడ్డి : సామాన్య గ్రామీణ కుటుంబ అవసరాల్లో ముఖ్యమైన మంచినీటి సేకరణలో ప్రధాన పాత్ర పోషించేది ఈ ప్లాస్టిక్ బిందెలదే.. ఎక్కువకాలం మన్నకపోయినా తక్కువ ఖర్చుతో, తేలిగ్గా ఉండే ప్లాస్టిక్ బిందెలకు గ్రామాల్లో డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలో అమ్మకానికి వచ్చిన ప్లాస్టిక్ బిందెలను ఫొటోలో చూడవచ్చు.

పీహెచ్సీలో వెక్కిరిస్తున్న ఖాళీలు

- అరకొర సిబ్బందితో అవస్థలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

భిక్కనూరు : మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న భిక్కనూరు పీహెచ్సీ 24 గంటలు పనిచేస్తున్నట్లుగా రికార్డుల్లో ఉన్నప్పటికీ సిబ్బంది పూర్తిస్థాయిలో లేక ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. భిక్కనూరు పీహెచ్సీలో మూడు వైద్యుల పోస్టులు ఉండగా డాక్టర్ యెమిమా ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పోస్టింగ్ తీసుకున్న వైద్యుడు ఆదర్శ్ను మాచారెడ్డి పీహెచ్సీకి మరో వైద్యుడు చంద్రమౌళిని పిట్లం మండలం పుల్కల్ పీహెచ్సీకి డిప్యూటేషన్పై పంపారు. ఫార్మసిస్టును ఇక్కడి నుంచి బదిలీ చేశారే తప్ప మరొక్కరికి పోస్టింగ్ ఇవ్వలేదు. దీంతో ఫార్మసిస్ట్ పోస్టు ఖాళీగా ఉంది. ల్యాబ్ టెక్నీషియన్ కూడా లేరు. ముగ్గురు స్టాఫ్ నర్స్లకు గాను ఇద్దరే విధులు నిర్వహిస్తున్నారు. ఒక పోస్టు ఖాళీగా ఉంది. ఆస్పత్రి పరిధిలో ఏడుగురు ఫస్ట్ ఏఎన్ఎంలకు గాను ఒక్కరే ఉన్నారు. ఆరుగురు ఏఎన్ఎం పోస్టులు ఖాళీ ఉన్నాయి. సెకండ్ ఏఎన్ఎంలకు ఏడుగురికి ఏడుగురు ఉన్నప్పటికి మొదటి ఏఎన్ఎం బాధ్యతలు మొత్తం సెకండ్ ఏఎన్ఎంల మీద పడడంతో వారు అదనపు బాధ్యతలతో ఇబ్బందులు పడుతున్నారు.

వైద్య విస్తరణ అధికారులు..

వైద్యవిస్తరణ అధికారులు (హెచ్ఈవో) పోస్టులు రెండు ఉండగా ఒక్కరే ఉన్నారు. ఇక్కడి హెచ్ఈవోను డిప్యూటేషన్పై ఎస్పీబీడీసీకి పంపించారు. సీనియర్ అసిస్టెంట్ పోస్టు, పురుష సూపర్వైజర్ పోస్టుకూడా ఖాళీగా ఉంది. మహిళా సూపర్వైజర్ల రెండు పోస్టులకు ఇద్దరున్నారు. పీహెచ్ఎన్ ఒక్కరున్నారు. డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. స్థానిక వైద్యురాలు యోమిమా వినతి మేరకు వైద్యశాఖ అధికారులు మూడు రోజుల పాటు బీబీపేట పీహెచ్సీలో పనిచేస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటర్ను విధులకు పంపిస్తున్నారు. మొత్తం 30 మంది స్టాఫ్ ఉండాల్సి ఉండగా 15 మంది సిబ్బంది లేరు. దీంతో ఉన్న సిబ్బందికి అదనపు భారంతో తల్లడిల్లుతుండగా ప్రజలకు సరైన సమయంలో సేవలందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు 120 మందికి పైగా రోగులు ఔట్ పేషంట్గా వచ్చి వైద్య సేవలు పొందుతారు. ముగ్గురు నుంచి ఐదుగురు ఇన్పేషెంట్లుగా చేరి చికిత్సలు పొందుతారు. ప్రతినెలా ఈ ఆస్పత్రిలో ఐదు ప్రసవాలు జరుగుతున్నాయి. ఒక్కరే వైద్యురాలు ఉండడంతో ఇబ్బంది కలుగుతోంది. కాంటిజెన్సి వర్కర్లు, అటెండర్లు పూర్తిగా లేరు. దీంతో సిబ్బంది ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేసేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

భర్తీ చేయాలని కోరాము



ఆస్పత్రిలో ఉన్న 15 ఖాళీల గురించి వైద్యశాఖ ఉన్నతాధికారులకు నివేదించాను. ఇక్కడి పనిచేస్తున్న వారు బదిలీపై వెళ్లారు. ఇక్కడికి ఎవ్వరికీ పోస్టింగ్ ఇవ్వకపోవడంతో నెల రోజులకు పైగా ఇబ్బందిగా కలుగుతుంది.

– డాక్టర్ యెమిమా, పీహెచ్సీ వైద్యురాలు, భిక్కనూరు

రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించండి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

బిచ్కుంద(జుక్కల్): రుణమాఫీ కాని రైతుల వివరాలు వ్యవసాయ అధికారులు సేకరించి, ప్రభుత్వానికి పంపించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ బిచ్కుందలో పర్యటించారు. ప్రభుత్వ ఆస్పత్రి, ఐటీఐ కళాశాల, కేజీబీవీ, రైతువేదిక, ఎఫ్సీఐ గోదాములలో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. కలెక్టర్ ఐటీఐ కళాశాల, కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. కేజీబీవీలో భోజనం పరిశీలించి మొక్కలు నాటారు. రైతు వేదిక సందర్శించి రైతులు, వ్యవసాయ శాఖాధికారులతో మాట్లాడారు. బిచ్కుంద సొసైటీలో అర్హులైన రైతుల రుణాలపై ఆడిట్ చేసి ప్రభుత్వానికి పంపించామని.. అయినా ఆన్లైన్ పోర్టల్లో ఆడిట్ పెండింగ్ చూపిస్తోందని సొసైటీ కార్యదర్శి కలెక్టర్కు వివరించారు. కలెక్టర్, మినీ ట్యాంక్ బండ్ను సందర్శించి హరితవనం పరిశీలించారు. ఆస్పత్రిని సందర్శించారు. డిప్యుటేషన్పై బిచ్కుందలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కాళీదాస్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మెమో ఇవ్వాలని జిల్లా అధికారిని ఆదేశించారు. హజ్గుల్, పుల్కల్, ఖద్గాం, శెట్లూర్లో మంజీరా నది నుంచి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని తహసీల్దార్ సురేష్ను ఆదేశించారు. ఆర్డీవో రమేష్ రాథోడ్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవోగోపాల్ పాల్గొన్నారు.

సీఎం సహకారంతో అభివృద్ధి



మహమ్మద్నగర్లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్

నిజాంసాగర్(జుక్కల్) : వెనుకబడిన ప్రాంతంగా ఉన్న జుక్కల్ నియోజకవర్గాన్ని సీఎం రేవంత్రెడ్డి సహకారంతో అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ పేర్కొన్నారు. విద్య, వైద్యంతో పాటు రహదారులు, ప్రధాన సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. శుక్రవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో 33 /11 కేవీ విద్యుత్ సబ్స్టేషన్ నిర్మాణానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ చేతుల మీదుగా భూమిపూజ, శిలాఫలకం అవిష్కరించారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని మాటివ్వడం, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రూ. లక్ష కూడా రుణమాఫీ చేయలేదనారు. మహమ్మద్ నగర్ మండల అభివృద్ధిని తాను బాధ్యతగా తీసుకుంటానన్నారు. నాయకులు ప్రదీప్, రవీందర్రెడ్డి, మల్లికార్జున్, మల్లయ్యగారి ఆకాష్, లోక్యానాయక్ తదితరులున్నారు. జుక్కల్ మండలానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం క్యాంప్ ఆఫీస్లో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయాగౌడ్, వెంకట్రామ్పటేల్, రాములుసేట్, వెంకట్గౌడ్, రాజు పటేల్ తదితరులున్నారు.

అర్హులకే 'డబుల్' ఇళ్లు



బీర్కూర్లో డబుల్బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న పోచారం శ్రీనివాస్రెడ్డి

బాన్సువాడ రూరల్ : బీర్కూర్ మండల కేంద్రంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్బెడ్ రూంఇళ్లను అర్హులైన వారికే కేటాయిస్తామని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి బీర్కూర్ గ్రామంలో పర్యటించారు. డబుల్బెడ్రూం లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరలోనే పెండింగ్ బిల్లులన్నీ మంజూరు చేయిస్తానన్నారు. 36 డబుల్బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తయిందని వాటిని త్వరలోనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన యాదవసంఘం భవనాన్ని, నగరేశ్వర ఆలయాన్ని ప్రారంభించారు. విశేషపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోయిని శంకర్, కాంత్రెడ్డి, సానెపు గంగారాం, విజయ్ప్రకాష్, రఘు తదితరులున్నారు.

మానసిక పరిపక్వతను పెంపొందించుకోవాలి



భిక్కనూరు : ప్రతి విద్యార్థి మానసిక పరిపక్వతను పెంపొందించుకోవాలని మానసిక వైద్యునిపుణుడు రమణ అన్నారు. శుక్రవారం భిక్కనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు నేటి ఓటమిని రేపటి గెలుపునకు పునాదిగా భావించి ముందుకు సాగాలన్నారు. క్షణికావేశాలకు లోనై ఆత్మహత్యలు చేసుకోవద్దన్నారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దన్నారు. మొబైల్ఫోన్లను తక్కువగా వాడాలన్నారు. మానసిక ఆందోళనకు గురైతే టోల్ఫ్రీనంబర్ 14416కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి రాధిక, పీహెచ్సీ వైద్యురాలు యెమిమా, సోషల్ వర్కరు రాహుల్ నేత, పీహెచ్సీ సిబ్బంది వెంకటరమణ, మంజుల పాల్గొన్నారు.

స్కూల్ యాజమాన్యంపై ఆగ్రహం



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చైర్పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ రోడ్లో జీవదాన్ హైస్కూల్ను మున్సిపల్ అధికారులతో కలిసి మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. పాఠశాలలో బాత్ రూమ్స్, టాయిలెట్స్ అధ్వానంగా ఉండటంతో పాటు దుర్గంధం వస్తుండడంతో స్కూల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈవో ఎల్లయ్యకు ఫిర్యాదు చేశారు. రికార్డులను చూపించకపోవడంతో ఎంఈవోతో పాటు చైర్పర్సన్ ఆగ్రహం వ్య క్తం చేశారు. డీఈవోకు ఫోన్లో ఫిర్యాదు చేశారు. స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డి మాండ్ చేశారు. అగ్నిమాపక అధికారి సుధాకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీల ధర్నా

కామారెడ్డి టౌన్ : తమ డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్వాడీలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని ఐదు ప్రాజెక్ట్ల పరిధిలో అంగన్వాడీలు బీఎల్వో విధులు చేయలేమన్నారు. తమకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు సురేష్, అంగన్వాడీలు విజయ, సరిత తదితరులు పాల్గొన్నారు.

నేడు గడికోటలో చర్చావేదిక

దోమకొండ : తెయూ సౌత్ క్యాంపస్తో పాటు దోమకొండ గడికోట ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ చరిత్ర, వారసత్వం(ప్రాచీన కాలం నుంచి ప్రస్తుత కాలం వరకు) అనే అంశంపై చర్చావేదిక నిర్వహిస్తున్నామని సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ ఆర్ సుధాకర్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెయూ రిజిస్ట్రార్ యాదగిరి, తెలంగాణ ప్రభుత్వ భాషా సంస్కృతి శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ,, సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య ఘంటా చంద్రశేఖర్ అతిథులుగా హాజరవుతున్నారు. చరిత్రకారులు, విద్యార్థులు తదితరులు హాజరుకావాలన్నారు.

క్రైం కార్నర్

విద్యుత్ షాక్తో రైతు మృతి



తిరుపతి(ఫైల్)

రాజంపేట: విద్యుత్షాక్తో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని అన్నారం తండాలో చోటు చేసుకుంది. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోత్ తిరుపతి(33) శుక్రవారం ఉదయం తన పొలం పనులకు వెళ్లాడు. తన పంట పొలం మీదుగా పక్కన ఉండే రైతులు కరెంట్ సప్లై కోసం తీసుకున్న విద్యుత్ తీగలు తిరుపతికి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య బానోత్ సోన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆటోలో చైన్స్నాచింగ్



బాధితురాలు నర్సుబాయి

ఆర్మూర్టౌన్: మామిడిపల్లి శివారులో శుక్రవారం ఆటోలో దుండగులు చైన్ స్నాచింగ్కు పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. పెర్కిట్కు చెందిన బ్రాహ్మణపల్లి నర్సుబాయి పెళ్లికి వెళ్లేందుకు పెర్కిట్లో ఆటో ఎక్కింది. అయితే ఆటోలో మరో మహిళ ఉండగా.. ఆమెను మామిడిపల్లి చౌరస్తాలో దింపి ఎంఆర్గార్డెన్లో నిర్వహించే పెళ్లికి దింపుతామని వృద్ధురాలిని ఆటోడ్రైవర్ నమ్మించాడు. దీంతో ఆటోను మామిడిపల్లి చౌరస్తా కాకుండా హైవేకు ఆనుకొని ఉన్న అయ్యప్ప ఆలయం వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ వృద్ధురాలిపై ఆటోలో ఉన్న మహిళ ఆటో డ్రైవర్ దాడి చేసి ఆమె వద్ద ఉన్న మూడు తులాల బంగారు గుండ్లు, తులం బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

ఉరేసుకొని యువతి ఆత్మహత్య

కమ్మర్పల్లి: మండల కేంద్రంలోని పోచమ్మగల్లీకి చెందిన గడ్డం రవళి(24) గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అనిల్ రెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రవళి హైదరాబాద్లో ఉన్నత విద్యను అభ్యసిస్తోంది. ఈమెకు కొన్ని నెలల క్రితం వివాహ సంబంధం ఖరారు కాగా, కొన్ని కారణాలతో ఇరు పక్షాలు సంబంధాన్ని రద్దు చేసుకున్నారు. దీంతో నాటి నుంచి రవళి మనస్తాపంతో ఉంది. గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి కమ్మర్పల్లికి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాక్టర్ల పట్టివేత



ఇందల్వాయి: ఇందల్వాయి, నిజామాబాద్ సౌత్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అటవీ భూ మిని ఆక్రమించి చదును చేస్తున్న ఐదు ట్రాక్టర్లను ప ట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో రవి మో హన్ భట్ తెలిపారు. దుబ్బాక, బాడ్సి, గండితండా, మంచిప్ప, దూస్గాం బీట్ల పరిధిలో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా అటవీ భూముల ను ఆక్రమించి చదును చేస్తున్నట్లు గుర్తించి దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు.ఎవరైనా అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అధికారులు,సిబ్బందిపాల్గొన్నారు.

ఇసుక నిల్వలు స్వాధీనం



రుద్రూర్: పొతంగల్ శివారులోని వీరభద్ర మందిరం సమీపంలో, కొడిచర్ల శివారులో అక్రమంగా డంపు చేసిన ఇసుక నిల్వలను రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పొతంగల్ శివారులో సుమారు 35 ట్రాక్టర్లు, కొడిచర్ల శివారులో పది ట్రాక్టర్ల ఇసుక ఉన్నట్లు గుర్తించిన అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఇసుకను తహసీల్ కార్యాలయంలో వేలం వేయనున్నట్టు తహసీల్దార్ మల్లయ్య పే ర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ. ఐదు వే లు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని వెల్లడించారు.

బాలుడిపై కుక్కల దాడి

రుద్రూర్: రుద్రూర్, పొతంగల్ మండల కేంద్రాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. చిన్నపిల్లలను బయటకు పంపాలంటే తల్లితండ్రులు జంకుతున్నారు. కుక్కలు గుంపుగుంపులుగా తిరుగుతూ కొత్తవారిపై దాడి చేస్తున్నాయి. శుక్రవారం పొతంగల్ మండల కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తున్న ఐదేళ్ల బాలుడిపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో గాయపడ్డ బాలుడిని చికిత్స నిమిత్తం కోటగిరి కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

పీఎంపీ నిర్లక్ష్యంతో ఒకరి మృతి



రాస్తారోకో చేస్తున్న దళిత సంఘాల నాయకులు



స్వామి (ఫైల్)

భిక్కనూరు: మండల కేంద్రంలో పీఎంపీ వైద్యుడి నిర్లక్ష్యంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన పెర్మల స్వామి (36) ఆటో మెకానిక్గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం ఆయనకు జ్వరంతో పాటు విపరీతమైన కడుపునొప్పి రావడంతో స్థానికంగా ఉండే పీఎంపీ వద్దకు కుటుంబీకులు తీసుకెళ్లారు. పరీక్షించిన సదరు పీఎంపీ స్వామికి సెలైన్ ఎక్కించి నాలుగున్నర గంటల పాటు అక్కడే ఉంచుకున్నాడు. ఆ తర్వాత పరిస్థితి బాగాలేదని కామారెడ్డికి తీసుకెళ్లాలని చెప్పాడు. దీంతో కుటుంబీకులు వెంటనే స్వామిని కామారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందాడు. ఒక గంట ముందు తీసుకు వచ్చి ఉంటే ప్రాణాలు దక్కేవని వైద్యులు చెప్పారు. దీంతో మృతుడి కుటుంబీకులు పీఎంపీ వైద్యుడి ఆస్పత్రికి ఎదుట రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. పీఎంపీ నిర్లక్ష్యంతోనే స్వామి మృతి చెందాడన్నారు. స్వామి మృతితో బాధిత కుటుంబం వీధిన పడిందని నష్టపరిహారం ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై సాయికుమార్ ఘటన స్థలానికి చేరుకొని రాస్తారోకో చేస్తున్న వారితో మాట్లాడి సముదాయించారు. ప్రైవేట్ వైద్యులు సైతం మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇవ్వడంతో బాధిత కుటుంబీకులు, బంధువులు, దళిత సంఘాల నాయకులు రాస్తారోకో విరమించారు.

అర్ధరాత్రి దొంగల హల్చల్





సీసీ ఫుటేజీలో రికార్డయిన దొంగల కదలికలు, విచారణ చేపడుతున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని స్నేహపురి కాలనీ, వివేకానంద, విద్యానగర్ కాలనీల్లో తాళం వేసి ఉన్న పలువురి ఇళ్లల్లో గురువారం అర్ధరాత్రి దొంగలు హల్చల్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. స్నేహపురి కాలనీలోని రోడ్ నెంబర్ 10లో ఉన్న ఖాజా పాషా,ల్యాగ కృష్ణారెడ్డి, విద్యానగర్లోని లక్ష్మయ్య, వివేకానంద కాలనీలోని ఉన్న పవన్ కుమార్ ఇండ్ల తాళాలను దుండగులు పగులగొట్టి సామాన్లను చిందరవందర చేశారు. ఆయా ఇండ్లలో దాచి ఉంచిన కొంత బంగారం, వెండి ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయి. తాళం వేసి ఉన్న ఇళ్ళలో చోరీలు జరిగినట్లు శుక్రవారం ఉదయం వెలుగు చూసింది. బాధిత కుటుంబాలన్నీ పెళ్లిళ్లు, ఫంక్షన్లు, ఇతర అవసరాల నిమిత్తం ఇళ్లకు తాళం వేసి ఇతర గ్రామాలకు వెళ్లారు. విషయాన్ని గమనించి దుండగులు చోరీలకు పాల్పడ్డారు. అశోక్నగర్లోని మరో రెండు ఇళ్ల తాళాలను పగులగొట్టి చోరీకి యత్నించారు. కానీ ఆ ఇంట్లో ఎవరూ నివాసం లేకపోవడంతో ఎలాంటి వస్తువులు చోరీకి గురి కాలేదు. పోలీసులు ఘటనా స్థలాలను పరిశీలించి విచారణ చేపట్టారు. క్లూస్ టీం బృందాలను రప్పించి ఆధారాలు సేకరించారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా ఇద్దరు దొంగలు ముసుగులు ధరించి లోనికి ప్రవేశించినట్లు నమోదైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్హెచ్వో చంద్రశేఖర్రెడ్డి పేర్కొన్నారు.

ట్రాన్స్ఫార్మర్ ధ్వంసం

బోధన్రూరల్: మండలంలోని అమ్దాపూర్లో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైరును గురువారం రాత్రి దొంగిలించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామంలోని శివసాయినగర్ కాలనీ సమీపంలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్లను ఎత్తుకెళ్ళారు. గ్రామస్తుల సమాచారం మేరకు విద్యుత్ శాఖ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



గాంధారి: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చోరీ కేసులో నిందితుడు ములుగు గణేశ్ అలియాస్ గన్నీను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఈ నెల 20న ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రెండు కంప్యూటర్లకు చెందిన పరికరాలు, ఓ బైక్ను దొంగిలించారు. సిబ్బంది మమ్మాయి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేయగా గాంధారి మండలం గుర్జాల్ గ్రామానికి చెందిన పాత నేరస్తుడు ములుగు గణేశ్ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. నిందుతుడి నుంచి దొంగిలించిన బైక్, కంప్యూటర్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హోమ్లోన్ సంస్థ కార్యాలయంలో చోరీ

ఆర్మూర్టౌన్: పెర్కిట్లోని ఓ హోమ్లోన్ సంస్థ కార్యాలయంలో గురువారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం సంస్థ నిర్వాహకులు కార్యాలయం తెరిచే సమయంలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. డాక్యుమెంట్లు ముట్టనప్పటికి కార్యాలయంలోఉన్న రూ.75వేల నగదు తీసుకువెళ్లారు. సంస్థ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

రౌడీషీటర్పై కేసు నమోదు

ఎల్లారెడ్డిరూరల్: గండిమాసానిపేట గ్రామానికి చెందిన రౌడీ షీటర్ జగన్గౌడ్పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్గౌడ్ను జగన్గౌడ్ చంపేస్తానని బెదిరించడంతో అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.